తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# 80 కేజీల గంజాయి పట్టివేత

**-ఐదుగురు అరెస్టు, రెండు కార్లు స్వాధీనం**



గూడూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : గంజాయి అక్రమ రవాణా జరగకుండా నిరంతరం తనిఖీలు జరుగుతున్నాయని చిల్లకూరు మండలం బుదనం జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేసి 80 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తిరుపతి జిల్లా ఎస్ఈబి ఏఎస్పీ రాజేందర్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కార్యాలయంలో తిరుపత జిల్లా సెబ్ ఎస్పి రాజేందర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. గంజాయి సరఫరా చేస్తున్న ముద్దాయిలను సీజ్ చేసిన గంజాయి వాహనాలను మీడియా ముందు ప్రవేశపెట్టారు. అనంతరం ఏఎస్పీ రాజేందర్ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా జరగకుండా నిరంతరం తనిఖీలు జరుగుతున్నాయని ఈ క్రమంలో చిల్లకూరు బుధనం జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఐదు మంది రెండు వాహనాలలో నర్సీపట్నం నుండి 80 కేజీల గంజాయిని కర్ణాటక రాష్ట్రం చెన్నపట్నం తీసుకు వెళ్తుండగా తనిఖీలో పట్టుకోవడం జరిగిందని వెల్లడించారు. గంజాయి విలువ 16 లక్షల రూపాయిల వరకు ఉంటుందని ముద్దాయిలను కోర్టుకు హాజరు పరుస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడ మత్తు పదార్థాలు రవాణా జరగకుండా సెబ్ అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తున్నారని ప్రజలు గంజాయి అక్రమ రవాణా గురించి తెలిసిన సమాచారాన్ని ఎస్సిబీ అధికారులకు తెలియ జేయాలని సూచించారు. ఈ సమావేశంలో సిఐ విజయకుమార్, ఎస్ఐ శేషమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యకు పెద్ద పీట వేసిన సిఎం

**-జగనన్న విదేశీ విద్యా దీవెన కింద14మంది విద్యార్థులకు జిల్లా కలెక్టర్**



విదేశీ విద్యా దీవెన చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త : రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అగ్రవర్ణాలకు చెందిన పేద విద్యార్థులు ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించే దిశలో జగనన్న విదేశీ విద్యా దీవెన అమలులో భాగంగా రాష్ట్రంలో ఈ ఏడాది టాప్ క్యూఎస్ విదేశి యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందిన అర్హులైన 390 మంది విద్యార్థులకు రూ. 41.60 కోట్లను, సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 95 మంది, వారిలో తిరిగి మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన 11మంది అభ్యర్థుల కు ప్రోత్సాహకంగా రూ.100.50 లక్షలను మొత్తం రూ. 42.60 కోట్లను కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి బుధవారం సంబంధిత మంత్రులతో కార్యదర్శులతో కలిసి వర్చువల్ విధానంలో గౌరవ ముఖ్యమంత్రి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయగా, తిరుపతి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి సంబంధిత అధికారులతో, లబ్ధిదారులతో కలిసి హాజరైయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందని ముఖ్యమంత్రి కంప్యూటర్ బటన్ నొక్కి రాష్ట్ర వ్యాప్తంగా విదేశీ విద్యా దీవెన నగదు, జగనన్న సివిల్ సర్వీసెస్ అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసారని అన్నారు. గత విద్యా సంవత్సరం 2022-23, 2023-24 మొదటి దఫా కలిపి రూ.2.31 కోట్లు, ముఖ్యమంత్రి విడుదల చేసిన విద్యా సంవత్సరం 2023 - 24కు గాను టాప్ విదేశీ యూనివర్సిటీల్లోని వాటిలో అడ్మిషన్లు పొందిన జిల్లాలోని మొత్తం అర్హత కలిగిన 14 మంది విద్యార్థులకు చెందిన ఖాతాల్లో రూ. 1,46,68,708 నగదు జమతో లబ్ధి చేకూరిందని గత సంవత్సరం లబ్ధితో కలిపి మొత్తం వెరసి రూ. 3.78 కోట్లు తెలిపారు. అదే విధంగా జగనన్న సివిల్ సర్వీసెస్ క్రింద జిల్లా నుండి ఎంపికైన నలుగురు విద్యార్థులకు ఒక్కొకరికీ రూ. 1 లక్ష వంతున రూ. 4 లక్షలను లబ్ధి చేకూరింది అని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జగనన్న విదేశీ విద్యా దీవెన ముఖ్యమంత్రి జమ చేసిన మొత్తం రూ. 14668708, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం రూ. 4 లక్షల మెగా చెక్కులను లబ్ధిదారులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ ఇన్చార్జి అధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికార అధికారి సూర్యనారాయణ తదితర అధికారులు, వివిధ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జగనన్న విదేశీ విద్యాదీవెన

**- జిల్లాలో 10 మంది విద్యార్థులకు రూ.1.25 కోట్లు ఆర్థిక సహాయం అందించిన సిఎం వైఎస్ జగన్**



జగనన్న విద్యాదీవెన మెగా చెక్కును లబ్దిదారులకు అందిస్తున్న కలెక్టర్

చిత్తూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త: జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద జిల్లాకు చెందిన 10 మంది విద్యార్థులకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం 1.25 కోట్ల రూపాయల ఆర్థిక సహాయంను అందజేశారు. తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి బుధవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం అందించే కార్యక్రమంను వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుండి వర్చువల్ విధానంలో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్, మేయర్ అముద, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, పాల ఏకరి రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్‌రాజా, స్త్రీ శిశు సంక్షేమశాఖ జోనల్ ఛైర్‌పర్సన్ శైలజారెడ్డి, జడ్పీ మహిళా స్థాయి సంఘ ఛైర్‌పర్సన్ భారతి, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రబ్బానీభాషా తదితరులు పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సగిలి షన్మోహన్ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వివరిస్తూ జిల్లాలో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ఈ విడత 1.25 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందని, జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంపై వివిధ కళాశాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బందితో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రోత్సహిస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్ సగిలి షన్మోహన్, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రూ.1.24 కోట్ల రూపాయల మెగా చెక్కును లబ్దిదారులకు అందజేశారు.

# ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలి



గూడూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నూతన భవన నిర్మాణాలు జనవరి 15 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని రోగులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే వరప్రసాద్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీ మేరీగ మురళి తదితరులు పాల్గొన్నారు. నూతన భవన నిర్మాణాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. హాస్పిటల్ బ్లాక్‌కు కావాల్సిన వసతులపై నిర్ణయాలు తీసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతన భవన నిర్మాణాలకు ప్రభుత్వం 22 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిందని నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. జనవరి 15 నాటికి నిర్మాణం పూర్తయ్యాల చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే ఆక్సిజన్ ప్లాంట్ మరమ్మత్తులో ఉందని రెండు రోజుల్లోగా రిపేరు చేయిస్తామని పేర్కొన్నారు. గూడూరు ప్రాథమిక హాస్పిటల్‌ను జిల్లా హాస్పిటల్‌గా మార్చాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి నివేదిస్తామని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు గోపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు కొండారెడ్డి హాస్పిటల్ సూపరింటెండెంట్ షరీనా, తదితరులు పాల్గొన్నారు.

# దోచుకో.. దాచుకో!

- దొరవారిసత్రం తహాశీల్దార్ కార్యాలయంలో కుంభకోణం
- రికార్డులు తారుమారు చేయడంలో ఆరితేరిన అధికారులు
- ఆర్ఓఆర్‌ల ద్వారా కోట్ల రూపాయలు వసూళ్లు



తహాశీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న బాధితులు

దొరవారిసత్రం, డిసెంబర్ 20 ప్రభాతవార్త : దొరికిన వారికి దొరికినంతగా దోచేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములు, ఇతర భూములు చిన్న చిన్న సవరణలు సరిగా లేని భూములే లక్ష్యం. ముఖ్యంగా అధికారుల అండదండలు, నాయకుల అండతో లక్షల రూపాయలు వసూలు చేస్తూ రికార్డులు తారుమారు చేయడంలో వీరికి సాటి లేరని నిరూపిస్తున్నారు. భూ యజమాని తన సొంత పొలానికి ఎన్నో ఏళ్ల నుంచి రికార్డులు సక్రమంగా లేని వారికి ఆర్ఓఆర్ ద్వారా భూహక్కు కల్పించాలని ఓ ప్రత్యేక జిఓ ఏర్పాటు చేసి ఆ జీఓ ద్వారా అసలైన భూ యజమానికి తన కల అయిన భూహక్కును కల్పించాలన్న పథకాన్ని అడ్డుగా పెట్టుకొని అధికారులు చేతివాటం ప్రదర్శించి లక్షల్లో వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారు. మరికొందరైతే ప్రభుత్వ భూములు, ఇతర భూములను ఆసరాగా తీసుకొని వాటిని కూడా భూకబ్జాదారుల పేరున రికార్డులను మార్చేసి జేబుల్లో కాసులు నింపుకొని అసలైన పేదవాడికి అన్యాయం చేస్తున్న సంఘటనలు దొరవారిసత్రం తహాశీల్దార్ కార్యాలయ ంలో చోటుచేసుకున్నాయి. దొరవారిసత్రం మండలం మేలనాలత్తూరు గ్రామంలో ఓ రైతు భూమిని మరో గ్రామానికి చెందిన మరో వ్యక్తికి ఆ భూమిని రికార్డులు మార్చి పట్టాలు ఇచ్చేశారని రెండురోజుల నుంచి తహాశీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్థులు ఆందోళన చేస్తున్నారు. బుధవారం దొరవారి సత్రం తహాశీల్దార్ కారానయలయం వద్ద మేలనాలత్తూరు గ్రామస్థులు వచ్చి తమ గోడు వినిపిద్దామనుకున్నా అధికారులు మాత్రం ఏమీ తెలియని స్థితిలో ఉన్నారు. ఒకరిద్దరు కాదు ఇదేవిధంగా ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూములు, ఇతర భూములను అధికారుల చేతి వాటంతో భూకబ్జాదారులకు రికార్డులు తారుమారు చేస్తున్నా స్థానిక ప్రజాప్రతినిధులు గాని, ఉన్నతాధికారులు గాని పట్టించుకోక పోవడంతో దొరవారిసత్రం తహాశీల్దార్ కార్యాలయం సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆర్ఓఆర్‌ను ప్రభుత్వం ఒక మంచి ఉద్దేశంతో తీసుకొస్తే దాన్ని అడ్డుపెట్టుకొని గ్రామాల్లో పేరుకుపోయి ఉన్న పలు రికార్డులను తారుమారు చేసి వారికి అనుకూలంగా ఉన్న వారి పేర్లు నమోదు చేసి పాస్‌బుక్కులు అందజేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దొరవారిసత్రం తహాశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న భూకుంభకోణాన్ని వెలికి తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

# అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లింగ్ మాఫియా ముఠా అరెస్ట్

**-పోలీసుల అదుపులో 16 మంది దుండగులు - రూ।।50 లక్షలు విలువ చేసే ఎర్రచందనం దుంగలు, మినీలారీ, రెండు కార్లు, నగదు స్వాధీనం**



దొంగల ముఠాను మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

సత్యవేడు, డిసెంబరు 20, ప్రభాతవార్త: మండలంలోని అమాసరెడ్డి గ్రామానికి సమీపంలో ఓ ప్రయివేట్ లైసెన్స్డ్ గోడౌన్‌లో నిలువ ఉంచిన ఎర్రచందనం దుంగలను ఛోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లింగ్ మాఫియా ముఠాను మంగళవారం దాసుకుప్పం బస్టాండ్ వద్ద పోలీసులు ఛాకచక్యంగా పట్టుకున్నారు. 16 మంది దుండగులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ।। 50 లక్షలు విలువ చేసే ఎర్రచందనం దుంగలు, ఒక మినీ లారీ, రండు కార్లు, నగదు రూ।।18,100లు, 14 మొబైల్ ఫోన్‌లు, డివిఆర్ జామర్, స్టార్లెక్స్ పెయింటింగ్ డబ్బా, 20మీటర్ల త్రాడు, గ్లౌజులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ పోలీస్ కార్యాలయంలో డిఎస్పీ శ్రీనివాస రావు, ఎఫ్ఆర్ఓ జయప్రసాదరావులు అదుపులోకి తీసుకున్న నిందితులను, స్వాధీనం చేసుకున్న వాటిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన రామచంద్రన్‌కు సంబంధించిన మామిడితోటలో అనుమతులు పొందిన ఎర్రచందనం గోడౌన్ ఉందన్నారు. గత డిసెంబరు 17వ తేది రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇక్కడి ఎర్రచందనం గోడౌన్ వద్ద కాపలా దారులను కట్టివేసి దుంగలు చోరీకి పాల్పడినట్లు తోట యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాలతో సిఐ శివకుమార్ రెడ్డి, ఎస్ఐలు నాగార్జున్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలు బృందాలుగా ఏర్పడి ధర్యాప్తును ముమ్మరం చేయడం జరిగిందన్నారు. ఈక్రమంలోనే తమిళనాడు రాష్ట్రానికి చెందిన 16 మంది అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లింగ్ ముఠాను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ఇందులో చెన్నై థౌసెండ్స్‌లైట్స్ నేరవిభాగంలో పనిచేస్తున్న చంద్రశేఖర్(40), తిరుచ్చి డిఆర్ఎం ఆఫీసు సూపరిడంట్ నాగరాజన్(57)లు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారన్నారు. మిగిలిన వారు తమిళనాడుకు చెందిన శాంతకుమార్(48), చిన్నరసు(30), సురేష్(32), సెల్వం(42), సెల్వరాజ ్(36), శివ(31), చంద్రన్(38), సత్యరాజ్(26), అన్నాదొరై(33), రాజేంద్రన్ (35), చిన్నతంబి(52)లు నిందితులుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురిని త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు. కాగా ఈకేసు ధర్యాప్తులో ప్రత్యేక ప్రతిభను కనబరిచిన సిఐ, ఎస్ఐలను డిఎస్పీ అభినందించారు.

# వేసిన పంటకు తెగుళ్ళు...పని చేయని మందులు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 20 ప్రభాతవార్త : ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారం వరకు వర్షాభావం రైతులను ఆందోళనకు గురించి చేసింది, నవంబర్ మాసంలో అడపా దడపా వర్షం కురిసినా చెరువులకు నీళ్ల చేరలేదు. సాధారణం కన్నా తక్కువ నమోదు అయ్యింది. దాంతో ఇక ఈ ఏడాది వ్యవసాయం ఎత్తుభారమే అని భావించిన రైతులకు మాంచెన్ రూపంలో వరుణుడు కరుణించాడు. ఖాళీగా ఉన్న చెరువుల్లోకి నీళ్ళు చేరింది. దాంతో ఉత్సాహంతో రైతులు పంటలు వేసుకున్నారు. ముదిరిపోతున్న నారును నాటి పొలంగా మలచారు. అయితే రైతులు ఆనందం ఎంతో కాలం నిలవలేదు. చెరువుల్లో నీళ్ళు చేరిందనే సంతోషం ఓ వైపు అయితే వేసిన పంటలకు తెగుళ్ళు ఆశించి రైతుల కంట కన్నీరు నింపింది.

**తెగుళ్ళతో సతమతం:**

శ్రీకాళహస్తి డివిజన్‌లో 32వేల హెక్టార్లలో పంటలు పండిస్తారు. ఇందులో అత్యధిక శాతం వరినే పండిస్తారు. ఈ నేపథ్యంలో రైతులు వరి పంటను వేసుకున్నారు. అయితే కొన్ని చోట్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వరి పైరు వెన్ను దశలో ఉంది. ఈ దశలో వెన్ను సగం బాగా ఉండగా సగం రంగు మారుతుంది. దీనిని బాగు చేయటానికి రైతులు వేల రూపాయల మందులు వాడుతున్నా కంట్రోల్ కావటం లేదని వాపోతున్నారు. వ్యవసాయ పనులు ఓ వైపు పంటలను కాపాడుకునే తాపత్రయం మరో వైపు దాంతో పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలు రైతులతో కిటకిటలాడుతున్నాయి. ఒక ఎకరాకు రూ.35వేలు ఖర్చు అవుతుందని ఈ పంటలను పండిస్తే చేతికొచ్చేది ఏమిటని వాపోతున్నారు. చివరి వరకు వరుణుడు కరుణించలేదని రోదిస్తే వరుణుడు కరుణించినా వాతావరణంలో మార్పుతో తెగుళ్ల సోకి నివారణకు పెట్టుబడులు పెట్టలేక ఇంట్లోని భార్యల పుస్తెలను తాకట్టుపెట్టుకునే పరిస్థితి చోటు చేసుకుందని రైతాంగం వాపోతున్నారు. రైతులకు ప్రభుత్వాలు అందించే రాయితీలు ఏ మాత్రం ఆదుకోవటం లేదని వాపోతున్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలు రాయితీలు, బ్యాంకులో సొమ్ములు ఆ యా ప్రభుత్వాల ప్రచారాలకు ఉపయోగపడుతున్నాయి జీవితాలనుమార్చటం లేదని తల్లడిల్లుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

శ్రీకాళహస్తి వ్యవసాయక ప్రధానమైన ప్రాంతం. ఇక్కడ నిత్యం గ్రామాల్లోని ప్రజలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమౌతారు. అయితేప్రతి ఏడాది వేసిన పంటలకు తెగుళ్ళతో రైతులు తల్లడిల్లుతున్నారు. నివారణకు పెట్టుబడులు పెట్టలేక సరైన సమాచారం ఇచ్చే అధికారుల్లేక దుకాణం దారుడు చెప్పె సూచనలతో వేలాది రూపాయల మందులు మూడు నాలుగుసార్లు ఉపయోగిస్తూ చివరకు అప్పుల పాలౌతున్నారు.

# పండుగ వాతావరణంలో ఆడుదాం ఆంధ్రా : జిల్లా కలెక్టర్



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త : ఆడుదాం ఆంధ్ర పండుగ వాతావరణంలో నిర్వహించనున్నామని అందుకు తగ్గ ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి వివరించారు. బుధవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో, ఎస్‌పిలతో సచివాలయ స్థాయి వరకు తెలిసేలా సమీక్ష నిర్వహించగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరిస్తూ జిల్లాలో ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించి 502 మైదానాల గుర్తింపు పూర్తి చేసి ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తామని, మొదటి రోజున అన్ని ప్రదేశాల్లో 2కె రన్ నిర్వహించనున్నామని వివరించారు. జిల్లాలో 13.5 లక్షల మంది వీక్షించే విధంగా రిజిస్టర్ చేసుకున్నారని, క్రీడాకారులు పాల్గొనడానికి రిజిస్టర్ అయ్యారని వివరించారు. జిల్లాలకు క్రీడలకు సంబంధించిన స్పోర్ట్స్ కిట్స్, టిషర్ట్స్, మెటీరియల్, మెడల్స్ వంటివి జిల్లాకు అందాయని వివరించారు. క్రీడల నిర్వహణకు పిఇటి, పిడిలు, స్పోర్ట్స్ సిబ్బంది 635 మందిని నియమించామని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడానికి టీమ్స్ ఏర్పాటు సిద్ధంచేసామని సాంప్రదాయ క్రీడల ఆటవిడుపు ప్రారంభమే లక్ష్యంగా ఉన్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, డిఎల్‌డిఓలు సుశీలా దేవి, ఆదిశేషారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఏకాదశికి భద్రతాపరమైన ఏర్పాట్లు పూర్తి : ఎస్పీ



వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పి

తిరుపతి క్రైం, డిసెంబర్ 20 ప్రభాతవార్త : వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలను పురస్కరించుకుని బుధవారం స్థానిక పోలీసు అతిథి గృహం సమావేశ మందిరం నందు జిల్లా పోలీస్ అధికారులు, టిటిడి విజిలెన్స్ అధికారులతో జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి, టిటిడి చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ నరసింహ కిషోర్, వారు భక్తుల భద్రతపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి పి.పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి ద్వాదశి పర్వదినాలలో తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వైకుంఠ ద్వార దర్శనార్థం స్థానిక ప్రజలే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి అశేష భక్త జనం వచ్చే అవకాశం ఉన్నందున భద్రతాపరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఉన్నామన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వారు వైకుంఠ ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏకాదశి ద్వాదశి రోజులతో పాటు మొత్తం 10 రోజులు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం ఉంటుంది. భారీగా భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని టోకన్ల జారీ చేయు కేంద్రాలలోని క్యూలైన్లలో తోపులాటలు జరుగకుండా, అలాగే రద్దీని క్రమబద్ధికరించడానికి తగినంత పోలీస్ బలగాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏకాదశి, ద్వాదశి రోజులే కాకుండా మొత్తం 10 రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారని, ప్రజలు ఆత్రుత పడకుండా సహనం వహించి తోపులాటలకు అవకాశం ఇవ్వకుండా తిరుపతి నందు టోకెన్లు పొంది, ప్రశాంతమైన వాతావరణంలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని టిటిడి నియమ నిబంధనలు, సూచనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజులలో నిర్మలంగా భక్తులు శ్రీవారిని దర్శించుకుని పునీతులు కావాలని, భక్తులు తమ విలువైన ఆభరణాలను భద్రంగా చూసుకోవాలని అలాగే తమతో పాటు వచ్చిన పిల్లలను, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అనంతరం తిరుపతి నగరంలో 9 ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక టోకెన్లు జారీ చేయు కేంద్రాల వద్ద భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి క్షేత్ర స్థాయిలో పర్యటించి, కేంద్రాలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు.

# ఎన్నికల సమరంకు వ్యూహాత్మకంగా ముందడుగు

**- పూతలపట్టు నియోజకవర్గ 'దేశం' ఇన్‌ఛార్జీ డాక్టర్ మురళీమోహన్**



చిత్తూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త: పూతలపట్టు నియోజకవర్గంలో 2024 అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ శ్రేణులను వ్యూహాత్మకంగా సిద్ధం చేసి ముందడుగు వేస్తున్నట్లు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జీ డాక్టర్ మురళీమోహన్ పేర్కొన్నారు. పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడి జరిగిన మూడు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పరాజయం పాలుకావడంతో పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎలాగైనా ఇక్కడి నుండి పార్టీ జెండా ఎగురాలని నిర్ణయించి భారీ కసరత్తు చేసి తనకు పార్టీ అభ్యర్థిత్వం కేటాయించారని, అందుకు అనుగుణంగా పార్టీ క్షేత్ర స్థాయి నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ప్రజల్లోకి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. పూతలపట్టు నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వ్ కావడం, తనకు ఎస్సీలో సానుకూల వాతావరణం నెలకొనడంతో ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందడానికి నాయకులు, కార్యకర్తలు కంకణం కట్టుకొని పని చేస్తున్నారన్నారు. అధికార వైకాపా ఎమ్మెల్యేపై నియోజకవర్గంలో అసంతృప్తి నెలకొనడంతో ఆ పార్టీకి చెందిన ఎస్సీ నాయకులు, మేథావులు తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నారన్నారు. ఇప్పటికే పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి దళితవాడల్లో పల్లె నిద్ర చేపట్టడం, వారితో మమేకం కావడం జరుగుతుందన్నారు. పార్టీ కోసం పోరాటం చేస్తున్న తనపై పోలీసులు 12 అక్రమ కేసులు బనాయించారని, దీంతో 53 రోజుల పాటు తాను అజ్ఞాతంలో వున్నానని, ఇకపై పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ విజయం సాధించేలా అందరిని కలుపుకొని ముందడుగు వేస్తున్నట్లు డాక్టర్ మురళీమోహన్ పేర్కొన్నారు.

## వైకుంఠద్వార దర్శన...టోకెన్లకు ఏర్పాట్లు సిద్ధం

**-రేపు మధ్యాహ్నం నుండి జారీ -భక్తులకు సకల సౌకర్యాలు**




తిరుమల, డిసెంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలేశుని ఆలయంలో 23వతేదీ తెల్లవారు జామున తెరచుకోనున్న పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీకి టిటిడి ఏర్పాట్లు పూర్తిచేసింది. పదిరోజులకు సంబంధించిన ఈ టోకెన్లను రేపు మధ్యాహ్నం 2గంటల నుండి 90 కౌంటర్లలో జారీచేస్తారు. 9కేంద్రాల్లో 90 కౌంటర్లద్వారా 4,23,500 సర్వ దర్శనం టోకెన్లు టోకెన్లు పూర్తయ్యేవరకు నిరంత రాయంగా జారీచేస్తారు. భక్తులు ఆధార్‌కార్డులు తీసుకుని క్యూలైన్లలో నిలబడితే వారి వరుసవచ్చిన వెంటనే టోకెన్ అందుకోవచ్చు. టోకెన్లు కలిగిన భక్తులకు తిరుమలలో గదులు కేటాయించడం జరుగుతుంది. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పోలీసులు క్యూలైన్లను నిర్వహిం చాలని ఎస్పి పరమేశ్వరరెడ్డి ఆదేశించారు.

## అమరరాజా సంస్థల 38వ వ్యవస్థాపక దినోత్సవం

**-వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అమర రాజాపై ప్రశంసల జల్లు**



రేణిగుంట, డిసెంబరు 20 ప్రభాతవార్త: ప్రత్యక్షంగా వేలాది మందికి పరోక్షంగా లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న అమరరాజా సంస్థల 38వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పలువురు ప్రశంసలతో ముంచెత్తారు. అమరరాజా 38వ వ్యవస్థాపక దినోత్సవాన్ని రేణిగుంట మండలం కరకంబాడి అమరరాజా ప్రధాన కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరరాజా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ డా. గల్లా రామచంద్రనాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమర ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి, గౌరినేని, సంస్థల డైరెక్టర్లు, సంస్థ ప్రధాన ప్రతినిధులు హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాదిత్య గౌరినేని, సిద్ధార్థ గల్లా, అశోక్ గల్లా, విశిష్ట పుదుచ్చేరి మాజీ లెప్టినెంట్ గవర్నర్ డా. కిరణ్‌బేడి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అమరరాజా సంస్థ తిరుపతి రోడ్లను సురక్షితంగా మార్చేందుకు అమరరాజా రోడ్డు సేఫ్టీ అవేర్నెస్ డ్రైవ్‌ను ప్రకటించింది. 38 సంవత్సరాల సంస్థ సుదీర్ఘ ప్రయాణంలో మద్దతుగా నిలిచిన పలువురు సంఘం నాయకలను సన్మానించారు. 25 సంవత్సరాలు పైన పని చేస్తున్న 135 మంది సీనియర్ ఉద్యోగులకు లాంగ్ సర్వీస్ అవార్డులను ప్రకటించారు. సంస్థల అభివృద్ధికి దోహదం చేస్తున్న వారి కోసం అమరరాజా బెటర్‌వే అవార్డులు అందజేశారు. ముగ్గురు గ్రామీణ ప్రాంత పారిశ్రామికవేత్తలకు మూడు లక్షల రూపాయల నగదుతో పాటు సంస్థ మార్కెటింగ్, హెచ్‌ఆర్, ఫైనాన్స్, సప్లయ్‌చైన్ సీఎక్స్‌వోలతో ఒక ఏడాది మెంటర్ షిప్ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ గల్లా జయదేవ్ వర్చువల్‌గా మాట్లాడుతూ 1985వ సంవత్సరం అమరరాజా పవర్‌స్టింతో ప్రారంభమై ప్రస్తుతం ఆరు కంపెనీలు, 17 వ్యాపారాలతో 16 వేల మందికి పై చిలుకు ఉద్యోగస్తులతో దినదినాభివృద్ధి చెందారు. 1.75 బిలియన్ డాలర్ల బహుళ జాతి సంస్థగా ఎదగడంలోసంస్థలో ఉన్నఅందరి కృషి ఉందన్నారు. తమ సంస్థల ప్రయాణం వ్యాపార రంగంలో, ఉద్యోగులు, కార్మికుల జీవనోపాధి మెరుగుపరచడంలో ముందుంటుందన్నారు. అందరి సహకారంతో గొప్ప విజయాలను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమాల అనంతరం కేరళ బృందం ప్రదర్శి ంచిన 3 వేల సంవత్సరాల ప్రాచీన కలరిపయట్టు యుద్ధ సాంస్కృతిక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.

## వైకుంఠ ఏకాదశికి ముస్తాబవుతున్న శ్రీకళ్యాణ వెంకన్న ఆలయం

**-భక్తులను ఆకర్షిస్తున్న విద్యుత్ అలంకరణ**



తిరుపతిరూరల్, డిసెంబర్20 ప్రభాతవార్త: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకని తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం ముస్తాబు అయింది. ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి పర్వదినంకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయంలో లోపల ఏర్పాటు చేసిన పుష్పశోభితం విశేషంగా ఆకర్షిస్తుంది. పచ్చని తోరణాలతో సరి కొత్త శోభను సంతరించుకుంది. భక్తుల రద్దీకి తగినట్లుగా ఆలయం వద్ద పటిష్ట క్యూలైన్లు ఏర్పాటు చేసారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్ళలేని భక్తులు తుమ్మలగుంట శ్రీకళ్యాణ వెంకన్నను దర్శించుటకు విచ్చేస్తారని తెలిపారు. శ్రీకళ్యాణ వెంకన్న దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి సంతృప్తిగా దర్శన భాగ్యం కల్పిస్తామని తెలిపారు. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకని ఆలయంలో ఉదయం 4గంటలకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న ఆలయవ్యవస్థాపక ధర్మకర్త ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు.

## వివాహేతర సంబంధమే ప్రాణం తీసిందా?!

**-పోలీసులు అదుపులో ఇద్దరు**



శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం గ్రామ సమీపంలోని పంటపొలం కాలువ పక్కన ఓయువతి శవాన్ని సోమవారం గ్రామస్తులు కనుగొని పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు రంగంలో దిగారు. ప్రత్యేక దళాలను సిఐ అజయ్‌కుమార్ ఏర్పాటు చేసి శవాన్ని పోస్టు మార్టంకు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసారు. పోలీసుల విచారణలో మొదటగా గుర్తుతెలియని శవంగా గుర్తించిన యువతి పేరు విద్యాలత (22) అని గుర్తించారు. ఆమె బంధువుల ద్వారా పోలీసులు సేకరించిన సమాచారం మేరకు తమ బిడ్డను హత్య చేసారని ఆరోపించారు. విద్యాలతకు 2018 ఏప్రిల్ 29న రాపూరు మండలం తెగచర్ల గ్రామానికి చెందిన రమేష్‌బాబుతో పెద్దల నిశ్చయించినట్లు వివాహం జరిగింది. అయితే విద్యాలత వివాహం చేసుకున్న రమేష్‌తో కలసి కాపురం చేయలేక పోయింది, అయితే విద్యాలత మరో వ్యక్తి శశికుమార్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు పోలీసుల ప్రాధమిక విచారణలో తెలిసింది. విద్యాలత, శశికుమార్‌లు సుమారు ఏడాది నుంచి తిరుచానూరు పంచాయతీ దామినీడు గ్రామం వద్ద గల హౌసింగ్ కాలనీలోని బ్లాక్ నెంబర్ 12లోని హస్ నెంబర్ 13జిలో ఉంటున్నారని విచారణలో తేలింది. శశికుమార్, విద్యాలతలు సహజీనం గడుపుతుండగా శశికుమార్ మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు చర్చించుకుంటున్నారు. శశికుమార్ వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకే విద్యాలతను హతమార్చారని విద్యాలత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే పూర్తి వివరాల కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయితే విద్యాలతది హత్యే అని తేలింది. అయుతే ఎవరెవరు? ఎలా హతమార్చారన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ హత్యకేసుకు సంబంధించి సిఐ అజయ్‌కుమార్‌ను ప్రశ్నించగా ఇద్దరిని అదుపులో తీసుకున్నామని మరోకరి కోసం గాలిస్తున్నట్లు వివరించారు.

## చేనేత కార్మికులను ప్రోత్సహించాలి

**-శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన జిల్లా కలెక్టర్**



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 20, ప్రభాతవార్త : చేనేత కార్మికులను ప్రోత్సహించాలని బుధవారం నుండి జనవరి 2వ తేది వరకు చేనేత వస్త్రప్రదర్శన శిల్పారామంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం తిరుచానూరులోని శిల్పారామంలో రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన 2023 కార్యక్రమంను జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత కార్మికులు ఆర్థికంగా సామాజికంగా ఎదిగేందుకు అన్ని విధాల సహకారం అందిస్తూ వారిని ప్రోత్సహించాల్సి అవసరం ఉందన్నారు. వారి కష్టాలను గుర్తించి తోడ్పాటును అందించేలా వారు తయారు చేసిన ఉత్పత్తులను ప్రతి ఒక్కరు కొనుగోలు చేయాలని అన్నారు. చేనేత కార్మికులు తయారుచేసిన నాణ్యమైన అన్ని రకాల వస్త్రాలు ఎలాంటి హానికర పదార్థాలు వాడరని తెలిపారు. అన్ని సీజన్లోనూ ప్రతి ఒక్కరు ధరించేలా తయారు చేయడం జరుగుతుందన్నారు. అన్ని రకాల వెరైటీలు చాలా తక్కువ రేటుతో ఇక్కడ ప్రదర్శన నిర్వహించడం జరిగిందన్నారు. చేనేత కార్మికులు సొంత మగ్గాలు ద్వారా తయారుచేసిన నాణ్యమైన, వైవిధ్యమైన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం సుమారు 120 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ ఎడి పిచ్చేశ్వర రావు, డెవలప్మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టం రైతులు పరిహారం కోసం సహకరించండి



తడ, డిసెంబర్ 20 ప్రభాతవార్త : ఇటీవల మిచౌంగ్ తుపాను, ఆ తర్వాత వచ్చిన వరదల కారణంగా పంట నష్టం జరిగిన గ్రామాలలో రైతులు అధికారులకు సహకరించి వివరాలు అందించాలని సూళ్లూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు జి.అనిత, తడ మండల వ్యవసాయాధికారి కాంచన కోరారు. వారు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. పంట నష్టం, ఇసుక మేట, నేల కొలతలను ప్రతి గ్రామంలోను గ్రామ వ్యవసాయ సహాయకులచే క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు తయారు చేస్తున్నామన్నారు. పంటనష్టం జరిగిన రైతులు వెంటనే తమ సిబ్బందిని కలిసి ఆధార్‌కార్డు, పొలం వివరాలు బ్యాంకు డాకుమెంట్లను అందించాలని కోరారు. ఈ నెల 28వ తేదీన ప్రభుత్వానికి పంట నష్టానికి సంబంధించిన నివేదికను సమర్పిస్తామని, ఆ లోపల రైతులు తమ వివరాలు ఉన్నాయో లేదోనని రైతు భరోసా కేంద్రాలలో ప్రచురించే జాబితా ద్వారా తెలుసుకోవాలన్నారు. 22వ తేదీలోగా పంటనష్టం జరిగిన రైతులు వివరాలు అందించాలని అధికారులు తెలియజేశారు. నారుమడులు మరియు నెలలోపు నాట్లు వేసిన వరిపైరు నష్టం జరిగిన వాటికి 80 శాతం సబ్సిడీ వరి విత్తనాలు అందించినట్లు ఏడీ పేర్కొన్నారు. ఇప్పటిదాకా ఇక్కడ 6256 ఎకరాలలో వరిపైరు దెబ్బతిన్నట్లు జాబితా తయారు చేశామని, 250 ఎకరాలలో ఇసుక మేట వేసినట్లు గుర్తించామన్నారు. అంచనాల పరిశీలన నిమిత్తం తాము వివిధ గ్రామాలలో నేరుగా పొలాల పరిశీలనతో పాటు ఆయా చోట్ల సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు సూచనలు అందించినట్లు ఏడీ అనిత ఈ సందర్భంగా వివరించారు.

## బాధితుల నష్టపరిహార చెల్లింపులో ప్రభుత్వం విఫలం



వాకాడు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : మిచౌంగ్ తుఫాను వరదల కారణంగా బాధితుల నష్టపరిహారం చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండల టిడిపి కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం వాకాడులోని తెలుగుదేశం పార్టీ పార్టీ నాయకులు నెల్లూరు సుధాకర్ రెడ్డి నివాసంలో మండల టిడిపి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హామీ మేరకు బాధితులకు వరద పరిహారం అందించడంలో విఫలమైన వైకాపా నాయకులు, వైకాపా ప్రజాప్రతినిధులు కప్పి పుచ్చుకున్నందుకు ఓట్లు రాజకీయం చేస్తున్నారని మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులతో పాటు, 2500 రూపాయిలు ప్రతి కుటుంబానికి పరిహారం అందిస్తామని చెప్పినప్పటికీ జనాభా ప్రాతిపదికన కుటుంబంలో పరిహారం అందిస్తామని చెప్పినప్పటికీ జనాభా ప్రాతిపదికన కుటుంబంలో పరిహారం అందివ్వడం ఎంత వరకు న్యాయమని ప్రభుత్వ యంత్రాంగాన్ని, వైకాపా ప్రజా ప్రతినిధులకు ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మాజీ జడ్పిటిసి సభ్యురాలు ప్రమీల, తిరుమూరు శ్రీనివాసరెడ్డి, అన్నమేటి చంద్రయ్య, కుంచం దయాకర్, అరుణ్ కుమార్, రామచంద్రయ్య, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం జగన్‌తోనే ప్రజాసంక్షేమం సాధ్యం

**- ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్**


కుప్పం, డిసెంబర్ 20 ప్రభాతవార్త : సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ డా॥ సుధీర్ అధ్వర్యంలో కుప్పం, కమతమూరులోని పలువార్డులకు సంబంధించి ఎపి నీడ్స్ వై జగన్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99శాతం సిఎం జగన్ అమలు చేశారన్నారు. నవరత్నాలు పథకాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ది కలిగిందన్నారు. వైకాపాది ప్రజా ప్రభుత్వమన్నారు. అనిమిగానిపల్లి సచివాలయం పరిధిలోనే ప్రజలకు 23.52కోట్లను సంక్షేమ పథకాలు, అభివృద్ధికి అందించామన్నారు. తనను మీ బిడ్డగా ఆదరించి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ మాట్లాడుతూ స్థానికుడు అయిన ఎమ్మెల్సీ భరత్ ప్రజలకు అందుబాటులో ఉంటారని అలాంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించుకుని మంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు పార్టీ పతాకావిష్కరణ, అభివృద్ధి, సంక్షేమ శిలాఫలకాలు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎఎంసి చైర్మన్ విద్యాసాగర్, కౌన్సిలర్లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కుప్పంలో తెదేపా..జనసేన నేతల సంబరాలు.. ప్రత్యేక పూజలు



కుప్పం, డిసెంబర్ 20 ప్రభాతవార్త : తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం కావడం పట్ల కుప్పంలో తెలుగుదేశం, జనసేన నేతలు సంబరాలు జరిపారు. నారా లోకేష్ పాదయాత్ర మొదలు పెట్టిన లక్ష్మీపురం శ్రీ వరదరాజస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం వెలుపల టెంకాయలు పగలగొట్టారు. ఈసందర్భంగా రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ 226రోజులపాటు 97నియోజకవర్గాల్లో నారా లోకేష్ పాదయాత్ర పూర్తికావడం ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా, జనసేన ప్రభుత్వం అధికారంలో రానుందన్నారు. కార్యక్రమంలో తెదేపా, జనసేన నేతలు కాణిపాకం వెంకటేష్, కన్నన్, రవి, డా॥ నరేష్, ఆర్‌ఆర్ రవి, కౌన్సిలర్లు సోమశేఖర్, జిమ్‌దాము, పిఎస్ సతీష్, ఉమాపతి, అప్పు, ఉదయ్, శ్యామ్, నరేష్, శారదమ్మ, తిరుమగళ్ పాల్గొన్నారు.

## కార్వేటినగరంలో వైభవంగా గంగజాతర



కార్వేటినగరం, డిసెంబరు 20 ప్రభాతవార్త: కార్వేటినగరంలో మంగళ, బుధవారాలలో గంగజాతర వైభవంగా జరిగింది. కార్వేటినగరం పురవీధుల్లో వేపాకు తోరణాలు, విద్యుద్దీపాలంకరణతో అలంకరణ చేశారు. రాత్రి గంగమ్మ, బంగారమ్మలను అలంకరణ చేసి పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి స్థానిక నాలుగురాళ్ళ వద్ద ఏర్పాటు చేశారు. భక్తులు కర్పూర, టెంకాయ హారతులతో పాటు జంతుబలులు ఇచ్చారు. వివిధ రకాల నృత్యాలు, విచిత్ర వేషధారణలతో ప్రజలను ఎంతగానో అలరించారు. ఉదయం నుండి రాత్రి వరకు నాలుగురాళ్ళ వద్ద గంగమ్మ, బంగారమ్మలకు హారతులు పట్టారు. భక్తులు వెయ్యికళ్ళు దుత్తలను అమ్మవారికి సమర్పించారు. రాత్రి 7గంటలకు గంగమ్మను ఊరేగింపుగా తీసుకెళ్ళి నిమజ్జనం చేశారు. జాతర సంధర్భంగా ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కార్వేటినగరం ఎస్ఐ దస్తగిరి జాగ్రత్తలు తీసుకున్నారు. కార్వేటినగరం రాజావీధిలో వెంకటేష్ అనే దాత అన్నదానం చేశారు, కార్యక్రమంలో ఆలయఅధ్యక్షులు కొప్పేటి ప్రసాద్, ఉపాధ్యక్షులు కె.ఆర్.రంగనాధ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, భక్తులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం, సంక్షేమంకు పెద్దపీట



గుడిపాల, డిసెంబర్ 20 ప్రభాతవార్త: ప్రజల ఆరోగ్యం, సంక్షేమంకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి, ఎంపిపి ప్రసాద్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల రూపాయల నుండి 25 లక్షల రూపాయల వరకు పెంచిన సందర్భంగా నూతన ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను లబ్దిదారులకు డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి, ఎంపిపి ప్రసాద్‌రెడ్డిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య, సర్పంచ్ రజనీకాంత్, నాయకుడులు సింబు, సాయి, రవి, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, ఆశా వర్కర్లు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాలో 127 మందికి ఉద్యోగాలు



పుత్తూరు, డిసెంబరు 20 ప్రభాతవార్త : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో మొత్తం 321 మంది నిరుద్యోగులు హాజరవగా 127 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ యువతకు మెరుగైన జీవితం కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం జాబ్ మేళా ఏర్పాటు చేసిందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, కాలేజీ జెకెసి సంయుక్త ఆధ్వర్యంలో 23 మంది కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లడుతూ చదువుకున్న ఏ వ్యక్తి నిరుద్యోగిగా వుండకూడదని ప్రభుత్వం భావిస్తోందన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి గుణశేఖర్‌రెడ్డి, పుత్తూరు మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్‌లు డి.జయప్రకాశ్ (చిట్టి), డి.శంకర్, కాలేజీ ప్రతినిధులు టి.నరసింహులు, ఎ.సంధ్య, డాక్టర్ పి.సుజన, కిషోర్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు చైతన్య, అఫ్రిన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగన్‌కు రోజా జన్మదిన శుభాకాంక్షలు



పుత్తూరు, డిసెంబరు 20 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా బుధవారం ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆడుదాం ఆంధ్రాపై విజయవాడలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌కు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు చెబుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపి ఘన విజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహనరెడ్డి బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## జగనన్న పుట్టిన రోజు పాట క్యాసెట్ విడుదల



శ్రీకాళహస్తి, డిసెంబర్ 20 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్‌ఆర్‌సిపి నాయకుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి 51వ జన్మదినం సందర్భంగా శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి ప్రత్యేక పాటను పాడించారు. ఈ క్యాసెట్‌ను భారత అత్యున్నత క్రీడాకరులచేత తాడేపల్లి సిఎం క్యాంప్ కార్యాలయంలో విడుదల చేయించారు. శాసనసభ్యుడు బియ్యపు మధు సూదనరెడ్డి అధ్యక్షతన విడుదల కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. భారత అత్యున్నత క్రీడాకారులు టీమిండియా క్రికెటర్ అంబటి రాయుడు, ఇండియన్‌బ్యాడ్మింటన్ ఆడుదాం ఆంధ్ర అంబాసిడర్ క్రీడాకారిణి పివి సింధూ, కిడాంబి శ్రీకాంత్, ఇండియన్ అర్చర్ జ్యోతి సురేఖ, డిఫ్ ఇండియన్ టెన్నిస్ ప్లేయర్ షేక్.జఫ్రీన్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డి చేతుల మీదుగా విడుదల చేయించారు.

## వైకాపా ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు : రిషితారెడ్డి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 20 ప్రభాతవార్త : వైకాపా ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని రాష్ట్రంలో వైకాపా అరాచక పాలన సాగిస్తున్న ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి అన్నారు. తెదేపా పట్ట అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని 25వార్డు ఇన్‌ఛార్జులు మాజీ కౌన్సిలర్లు అనితమ్మ, అద్దంకి హేమంత్‌కుమార్, యశ్వంత్, కమల్, సాయిల బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రిషితారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైకాపా ప్రభుత్వంకు ప్రజలు బుద్దిచెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమే అని ప్రజల కష్టాలు తీర్చాలంటే తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఈసందర్భంగా వార్డుల్లో ఉన్న సమస్యలను పలువురు ప్రజల దృష్టికి తెచ్చారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25లక్షలకు పెంపు:పవిత్రారెడ్డి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 20 ప్రభాతవార్త : నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకంలో గతంలో కేవలం రూ.5లక్షల వరకు పరిమితి ఉండగా దీనిని రూ.25 లక్షలకు పెంచిన ఘనత సిఎంకే దక్కిందని శ్రీకాళహస్తి నియోజకవర్గ వైకాపా నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి వివరించారు. బుధవారం 18వ వార్డులో వైకాపా నాయకులు జనాన్ని చైతన్యవంతుల్ని చేయుటకు సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఇక్కడ కొత్తగా రూపొందించిన ఫిచర్స్‌తో కూడిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను పవిత్రారెడ్డి లబ్దిదారులకు అందజేసారు. ఈ సభాకార్యక్రమాలను పివిఆర్ గ్రూప్స్ అధినేత జనార్ధన్ రావు జె.పవార్, తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మెన్ సిరాజ్‌బాషా, పఠాన్ ఫరీద్‌ఖాన్, జి.వి.రమణమూర్తి (స్వామి), వైకాపా మైనారిటి నాయకుడు గోరా, ఫజల్, గయాజ్, అస్లాం, లాల్‌బాషా తదితరులు వెంటరాగా కార్యక్రమాలను నిర్వహించారు. సభలో లబ్దిదారులకు కార్డులను అందించిన పవిత్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు, సంస్కరణలు చేపట్టి ప్రతిఇంటికి ఆరోగ్యసేవలు అందేలా ప్రణాళికను రూపొందించి పేదలు ఎవ్వరూ వైద్యం కోసం ఇళ్ళను అమ్ముకోరాదని, అప్పుల పాలు కాకూడదనే భావంతోరూ.5లక్షల పరిమితిని రూ.25లక్షలకు పెంచిన యువ నాయకుడు మన సిఎం అని అన్నారు. నూతనంగా రూపొందించిన స్మార్ట్ కార్డులను అధికారులే ఇంటింటికి వచ్చి పంపిణి చేస్తారని పవిత్రారెడ్డి వివరించారు.

## 26న వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

శ్రీకాళహస్తి, డిసెంబర్ 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యధిక శాతం ఉన్న కాపు సామాజిక వర్గానికి సంబంధించి వంగవీటి రంగా విగ్రహాన్ని ఈ నెల 26 ఆవిష్కరించనున్నట్లు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఈమేరకు స్థలాన్ని పరిశీలించారు. ఏర్పాట్లు కార్యక్రమాలను సమీక్షించారు. కార్మిక, ప్రజా నాయకుడు వంగవీటి రంగా అన్నారు. ఆయన జన్మదినమైన డిసెంబర్ 26న ఏర్పాట్లుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ విగ్రహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి రోడ్డు దక్షిణకైలాసనగర్‌కు వెళ్ళె సర్కిల్ వద్ద ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ నెల 26న ఉదయం 10గంటల కు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి హాజరౌతారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ కాపు సామాజిక వర్గానికి చెందిన పోలసామి స్వర్ణమూర్తి, ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, సెన్నీరు కుప్పం శేఖర్, మందల బాలాజి కంటా ఉదయ్ కుమార్, పత్తి మణి, పుల్లయ్య, ప్రసాద్, గరికపాటి చంద్ర, చక్రాల మురళి, తీగల భాను, తేజ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టండి:కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త : ఈనెల 26న ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవానికి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్పందనలో వచ్చిన సమస్యల పరిష్కారం, ఆడుదాం ఆంధ్రా ఏర్పాట్లపై నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో అన్ని విభాగాల అధికారులతో కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించింది. వెంటనే పరిష్కరించాలని అన్నారు. పరిష్కారం కానీ సమస్యలను ఎందుకు కాలేదో వారికి తెలియజేయాలన్నారు. అలాగే సచివాలయాల వద్ద కూడా ప్రతి సోమవారం సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ నెల 26న ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవానికి అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చూడాలని అన్నారు. అన్నీ కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ రాధిక, రెవెన్యూ ఆఫీసర్ కెఎల్ వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్, డి.ఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి, సంజయ్ కుమార్, మహేష్, రాజు, శ్రావణి, మేనేజర్ చిట్టిబాబు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.